శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

ప్రతి గ్రామం అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యం"

విడవలూరు,మార్చి 23 ప్రభాతవార్త: మండలంలోని వావిళ్ల గ్రామంలో సిమెంట్ రోడ్డుకు శ్రీకారం చుట్టేందుకు కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా నాయకులు,గ్రామ ప్రజలు ఆమెకు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికి, గజమాలలు వేసి సత్కరించారు.

ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అవసరమైన ప్రతి అంశంపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరుస్తూ, ఒక స్కూల్ – ఒక కాన్సెప్ట్" విధానంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని పేర్కొంటూ, ప్రతి గ్రామంలో స్మశానవాటికల అభివృద్ధి పనులు చేపట్టామని, ఇప్పటివరకు సగానికి పైగా పనులు పూర్తి చేశామని వివరించారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో "పల్లె పండుగ" కార్యక్రమం ద్వారా వావిళ్లలో రూ.47 లక్షల వ్యయంతో ఈ సిమెంట్ రోడ్డును నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా విడవలూరువావిళ్ల కనెక్టింగ్ రోడ్డుకు రూ.30 లక్షలు మంజూరైందని, ప్రధాన రహదారి 620 మీటర్ల పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. హరిజనవాడలో ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి రూ.36 లక్షలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అలాగే పారుదల కాలువల శుభ్రపరిచే పనులు 700 ఎకరాల్లో వీపీఆర్ కన్స్ట్రక్షన్ ద్వారా పనులు చేయడం జరిగింది. ఏడు స్మశానవాటికల అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సీఎంఆర్ నిధుల ద్వారా సహాయం అందిస్తున్నామని, ఇప్పటివరకు 800 మందికి రూ.8 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పొదువు మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ, 206 మంది మహిళలకు రూ.3.74 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన రోడ్లు, మౌలిక వసతులను ఇప్పుడు పునరుద్ధరిస్తున్నామని, ప్రతి వర్గానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఏటూరు శ్రీహరి రెడ్డి, సర్పంచ్ డి సి చైర్మన్ పాశం శ్రీహరి రెడ్డి,అచ్యుత్ రెడ్డి, విజయ్ భాను రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య,అడపాల శ్రీధర్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఆవుల వాసు, తహసిల్దార్ కె.చంద్రశేఖర్ , ఎంపీడీవో నగేష్ కుమారి,తాత ప్రభాకర్, రమా, సురేందర్ రెడ్డి,ఏటూరు వెంకటేష్, పసుమర్తి దయాకర్, చెముకు శ్రీనివాసులు, బిజెపి మండల అధ్యక్షులు నాయకులు కొమ్మిరెడ్డి కోటిరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన

మేకపాటి దంపతులు

నెల్లూరు కార్పోరేషన్, మార్చి 23 ప్రభాతవార్త : ఉదయగిరి మాజీ శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి సోమవారం నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ.నందన్ని వారి బంగ్లాలో పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాల ని, గ్రంధాలయానికి విడుదల చేయాల్సినటువంటి సెస్ బకాయిలను విడుదల చేసి, గ్రంథాలయ అభివృద్ధికి మీ వంతు సహకారం అందించాలని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ గారిని నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి కోరారు.

వాటర్ ప్లాంట్ల అనధికారిక విద్యుత్ వాడకంపై కొరడా

- ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి

నెల్లూరు, మార్చి 23, ప్రభాతవార్త -వైద్యం ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో వాటర్ ప్లాంట్లకు అనధికారికంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారని అందిన ఫిర్యాదుపై తక్షణ చర్యలు తీసుకుంటామని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీసులో సోమవారం ఉదయం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కడప జిల్లా, జమ్మలమడుగు నుంచి ఒక వినియోగదారుడు మాట్లాడుతూ ఆ ప్రాంతంలో నిర్వహిస్తున్న రెండు వాటర్ ప్లాంట్‌లు రూ.లక్షల్లో విద్యుత్ బిల్లులు బకాయిలు పడ్డాయని, బిల్లు చెల్లించలేదని ఆ సర్వీసులను డిస్కనెక్ట్ చేసినప్పటికి అనధికారికంగా విద్యుత్‌ను వినియోగించుకుంటూ సంస్థకు నష్టం కలిగిస్తున్నారని తెలియజేశారు. ఈ అంశంపై సీఎండీ శివశంకర్ మాట్లాడుతూ ఈ అంశంపై విచారణ నిర్వహిస్తామని, సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంస్థకు నష్టం కలిగించే ఇటువంటి చర్యలను ఉపేక్షించబోమని తెలిపారు. అదే విధంగా సంస్థ అధికారులు సిబ్బంది పనితీరు, ఆర్థిక లావాదేవీలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం ద్వారా 50 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు 1912 లేదా 1800425155333 కు కాల్ చేయడం లేదా వాట్సప్ నంబరు 9133331912 కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరక్టర్ పి.ఆయూబ్ ఖాన్, డైరక్టర్ కే.గురవయ్య, డైరక్టర్ కే.రామమోహన్‌రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జే.రమణాదేవి, కే.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, ఎం.మురళీ కుమార్, సీహెచ్ రామచంద్రరావు, కే.సంపత్ కుమార్, జనరల్ మేనేజర్లు సురేంద్రరావు, చక్రపాణి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేచే శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో...

శ్రీ రామ నవమి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

చిల్లకూరు, మార్చి 23, ప్రభాతవార్త తమ్మినపట్నం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండ రామస్వామి వారి శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు మార్చి 25 నుండి మార్చి 31 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీ రామ నవమి బ్రహ్మోత్స వాల ఆహ్వాన పత్రికను గూడూరు నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ పాసిం సునీల్ కుమార్ ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలు ఆహ్వానంకు పెనుశిల లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం మాజీ చైర్మన్ తానంకి నానాజీని, మండల పార్టీ అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, గూడూరు రూరల్ సిఐ కిషోర్ బాబు, చిల్లకూరు మండలం సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబులను అహ్వానించారు. దేవస్థానం చైర్మన్ కోట సతీష్ యాదవ్, కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ నాయకులు ఓడూరు సత్యనారాయణ రెడ్డి, మట్టం శ్రావణి రెడ్డి, కొండాల శ్రీదేవి, గుండాల లీలావతి, కమిటీ సభ్యులు భక్తని రామయ్య, కొప్పాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

ఆర్టీఐ సెల్ కన్వీనర్‌గా రమేష్‌రెడ్డి

ఉదయగిరి, మార్చి 23, ప్రభాతవార్త జిల్లా బీజేపీ ఆర్టీఐ సెల్ కన్వీనర్‌గా బసినేనిపల్లి గ్రామానికి చెందిన ముడమాల రమేష్‌రెడ్డిని బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి నియమించారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లా బీజేపీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటానన్నారు. అలాగే తనపై ఎంతో నమ్మకంతో తనకు ఆర్టీఐ సెల్ కన్వీనర్ బాధ్యత అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తో పాటు జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

- మంత్రి ఆనం
- ఆంధ్రా ప్రాంత మత్స్యకారుల సంరక్షణ కోసం
- తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాల దాడులను ఎదుర్కొనేందుకు ఎందాకైనా సిద్ధం
- మత్స్యకారులకు సంపూర్ణ అండగా ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం
- మత్స్యకార వర్గాల చిరకాల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అధికార యంత్రాంగం మాస్టర్ ప్లాన్
- మత్స్యకారుల సమస్య పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి
- నెల్లూరు జిల్లా కలెక్టరేట్లో అధికారులతో సమీక్షించిన మంత్రి ఆనం

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 23, ప్రభాతవార్త: రాష్ట్రంలోని తీర ప్రాంత మత్స్యకార సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, శాశ్వత పరిష్కారానికై గట్టి చర్యలకు ఉపక్రమించినట్లు రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజిత వేజెండ్ల, శాసనమండలి సభ్యులు రాంగోపాల్ రెడ్డి, బీద రవిచంద్ర, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, పాశం సునీల్ కుమార్, నెలవల విజయశ్రీ తదితర నాయకులతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మత్స్యకార సమస్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు.

మంత్రి ఆనం మీడియాతో మాట్లాడుతూ తీర ప్రాంతంలోని మత్స్యకారులకు చిరకాలంగా పోరుగు రాష్ట్రాలైన తమిళనాడు, పుదుచ్చేరిలతో సమస్యలు ఉన్నాయని, వాటికి శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మన రాష్ట్ర మత్స్య సంపదను పొరుగు రాష్ట్రాలకు చెందిన మత్స్యకారులు హై పవర్ బోట్ల సహాయంతో దోచుకుంటున్న నేపథ్యంలో, ఇతర రాష్ట్రాలకు చెందిన బంధించిన నాలుగు బోట్లను గుర్తు తెలియని వ్యక్తులు విడుదల చేయించిన వైనం జిల్లా మత్స్యకారుల ఆవేదనకు కారణమైందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి సముద్ర జలాలపై గస్తీ కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుందన్నారు. ఈ దిశగా వివిధ శాఖల అధికారులు ఇప్పటికే ప్రయోగాత్మకంగా గస్తీ బోటు ను పరీక్షించారన్నారు. మెరైన్ పోలీస్, అటవీ, మత్స్య శాఖ, అగ్నిమాపక శాఖ లకు చెందిన అధికారులతో రెండు బోట్లు 24/7 విధానంలో సముద్రంలో ఏప్రిల్ 14 వరకు గస్తీ తిరుగుతాయన్నారు. ఏప్రిల్ 15 నుండి రెండు నెలలపాటు వేట నిషేధం అమల్లోకి వస్తున్నందున, ఈలోపు మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అందుకనుగుణంగా ముఖ్యమంత్రి ఆదేశాలతో రాష్ట్రస్థాయి ప్రత్యేక బృందం మంగళవారం జిల్లా కు విచ్చేస్తుందన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక బృందంతో సమావేశమై చర్చించి ప్రభుత్వానికి ఆచరణాత్మక నివేదిక సమర్పిస్తుందన్నారు. జిల్లాలోని మత్స్యకారులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, కూటమి ప్రభుత్వానికి ఎల్లప్పుడూ అండగా ఉండే మత్స్యకారులకు తోడుగా ఉంటామని మంత్రి ఆనం ఉద్ఘాటించారు. మూడు రాష్ట్రాల చెందిన సమస్య అయినందున కేంద్రానికి సైతం నివేదిక అందించి శాశ్వత పరిష్కారం కొరకు తీవ్ర ప్రయత్నాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీ ఆర్ ఓ విజయ్ కుమార్, నాయకులు గిరిధర్ రెడ్డి, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ శాంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చర్యలు

- క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల
- పరిష్కార వేదికకు 293 అర్జీలు

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 23, ప్రభాతవార్త సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ హిమాన్షు శుక్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్ఓ విజయ్ కుమార్, డి.పి.ఓ వసుమతి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి కృష్ణ కుమార్, డిపిఓ లీలారాణి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు, పింఛన్లకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ప్రతి జిల్లా అధికారి ఈపిటిఎస్ పోర్టల్‌లో వివరాలను అప్లోడ్ చేయాలని ఇప్పటికీ చాలామంది అధికారులు అప్లోడ్ చేయడం లేదని ఆయన అన్నారు. మొదలుపెట్టని వాళ్లు ఈపిటిఎస్ పోర్టల్‌లో మొదలుపెట్టి వివరాలను అప్లోడ్ చేయాలని ఆయన తెలిపారు. ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లును జిల్లా అధికారులు చేపట్టారు. వీటిలో సహాయకులతో కూడిన అర్జీల స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతోపాటు షామ్యానలు వేసి నీడను కల్పించారు. సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదుల స్వీకరణ త్వరితగతిన పరిష్కారానికి డివిజనుల వారీగా రెవెన్యూ క్లినిక్ ప్రత్యేక కౌంటర్లను తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసి అర్జీల సత్వర పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. తొలుత సదరు ఏర్పాటులను జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించి సిబ్బంది తగు సూచనలు సలహాలు అందించి పిర్యాదు దారులను ఎక్కువ సేపు నిలబడనీయక వారికి అవసరమైన అన్ని పనులను సజావుగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాఅధికారులు పాల్గొన్నారు. తొలుత వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

పరిష్కార వేదికకు 293 అర్జీలు

సోమవారం కలెక్టర్ కార్యాలయంలో 293 అర్జీలు రాగా దాంట్లో రెవెన్యూ 143, పోలీస్ 15, సర్వే అండ్ ల్యాండ్ 14, మునిసిపాలిటీ 33, తదితరశాఖలు మరిన్ని ఉన్నాయి.

కార్పొరేషన్ పరిష్కార వేదికలో 40అర్జీలు

నెల్లూరు కార్పోరేషన్, మార్చి 23 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దేవరకొండ సుజాత అశోక్, కమిషనర్ వైఓ. నందన్‌లు పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబందించి ఎల్ఆర్ఎస్ పథకం అమలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, మౌలిక వసతుల కల్పన తదితర సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని వాటికి శాశ్వత పరిష్కారం అందించేందుకు కృషిచేస్తామని తెలిపారు. అర్హులైన లబ్దిదారులు అందరూ 300చ.అ ఉచిత టిడ్కో గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నోటీసులు ఇచ్చినప్పటికి గృహాలకు రిజిస్ట్రేషన్ చేసుకోకుండా స్వాదీనం పొందని 408 గృహాలను అర్హులైన ఇతరులకు పిఎం అవాస్‌యోజనా 2.0ద్వార ఈ వారంలో అందజేసేందుకు ప్రతిపాదనలను సిద్దం చేశామని ప్రకటించారు. రాష్ట్ర హౌసింగ్ బోర్డు కార్పోరేషన్‌ద్వారా నిర్మించిన లేవుట్లలోని గృహాలను లబ్దిదారులు స్వాధీనం పొంది నివాసం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపిరు. నెల్లూరు నగరపాలక సంస్థకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సుమారుగా రూ.200కోట్లు బకాయిలు ఉన్నాయని ఇందులో వడ్డీ రాయితీ 50శాతంకు ఇంకా కేవలం వారం రోజులు మాత్రమే ఉందన్నారు. ఈనెలాఖరులోపు పన్నులు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని తెలిపారు. అభివృద్ధి పనులన్నీ ప్రజలు చెల్లించే పన్నుల ద్వారానే కొనసాగుతున్నాయిన నగర అభివృద్ధికి సహకరించేందుకు ప్రజలందరూ బాగస్వాములు కావాలని కమిషనర్ తెలిపారు. ఈ పరిష్కార వేధికలో టిడ్కో హౌసింగ్ 14, టౌన్‌ప్లానింగ్ 15, రెవెన్యూ 8, ఇంజనీరింగ్ 7, పబ్లిక్‌హెల్త్ 2, హెచ్‌సెక్షన్ 1, ఆడ్మినిస్ట్రేషన్ 1 మొత్తం 48 వినతులను కమిషనర్ స్వీకరించారు. నగరపాలకసంస్థ డిప్యూటి కమిషనర్ చెన్నుడు, స్వర్ణగ్రామ వార్డు సచివాలయాల అదనపు కమిషనర్ హిమబిందు, టౌన్‌ప్లానింగ్ సిపి రఘునాథ్‌రావు, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రహంతుజాని, ఈఈ శేషగిరిరావు, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రలాను సద్వినియోగం చేసుకోండి

నంగం మార్చి 23 ప్రభాతవార్త రైతులు ధాన్యంపు కొనుగోలు కేంద్రాలను వినియెగించుకోవాలని తహసిల్దారు రమాదేవి కోరారు. సోమవారం ఆమె స్థానిక తహసిల్దారు కార్యాలయంలో మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్న ఉద్దేశంతోనే ధాన్యపు కొనుకోలు కేంద్రాలను ప్రారంభించిందన్నారు. ఈ కేంద్రాలను వినిగించుకోవాలని అన్నారు. ఎవరైనా దళారులు మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే

వింజమూరు, మార్చి 23, ప్రభాతవార్త వింజమూరు మండలంలోని నందిగుంట పంచాయతీ పరిదిలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను సోమవారం స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న దొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం తీరును ఆయన స్వయంగా పరిశీలించారు. ఎమ్మెల్యే స్వయంగా విద్యార్థులకు భోజనాన్ని వడ్డించి, ఆపై వారితో కలిసి కూర్చుని భోజనం చేశారు. భోజనం నాణ్యత ఎలా ఉంది.. ప్రతి రోజు మెనూ ప్రకారం పెడుతన్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో బోధన సాగుతున్న తీరుపై కూడా పిల్లలతో ముచ్చటించారు. అనంతరం పాఠశాల ప్రాంగణాన్ని కలియతిరిగి ఎమ్మెల్యే, అక్కడి పరిసరాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణ ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎటువంటి అశ్రద్ధ వహించకూడదని, ముఖ్యంగా పోషకాహార పంపిణీలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను. పౌష్టికాహారాన్ని అందించాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తోందని విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే.నరిసంహారావు, ఉపాధ్యాయులు జక్కం మోహన్‌రెడ్డి, సంధిరెడ్డి మహేష్ కరిముల్లా, సిబ్బంది, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి రైతునూ ఆదుకుంటాం అధైర్యపడొద్దు

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
నష్టపోయిన ప్రతి సెంటు భూమికి నష్టపరిహారం అందిస్తాం
వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులకు మంత్రి ఆనం భరోసా
అనంతసాగరం మండలంలో దెబ్బతిన్న పంటలను ప్రత్యక్షంగా పరిశీలించిన మంత్రి ఆనం
రెండు రోజుల్లో పూర్తిస్థాయి నష్టపరిహారం వివరాలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం

అనంతసాగరం, మార్చి 23, ప్రభాతవార్త పంట నష్టపోయిన ప్రతిఒక్క రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని, ప్రతి సెంటు భూమికి నష్టపరిహారం చెల్లిస్తామని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హామీ ఇచ్చారు. అనంతసాగరం మండలంలోని చిలకలమర్రి, కామిరెడ్డిపాడు, మంగుపల్లి గ్రామాల్లో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న వరి, పత్తి, మిరప తదితర పంటలను మంత్రి రైతులు, అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా చేతికి వచ్చిన పంట పూర్తిగా నష్టపోయిందని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేయగా, ప్రతి రైతును ఆదుకుంటామని మంత్రి భరోసా ఇచ్చి ఓదార్చారు.

అనంతరం అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ శాఖల అధికారులు పంట నష్టం వివరాలను మంత్రికి తెలియజేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం కారణంగా అనంతసాగరం, మర్రిపాడు, కలువాయి, రాపూరు, సీతారాంపురం, లింగసముద్రం మండలాల్లోని 21 గ్రామాల్లో 1469 మంది రైతులు సుమారు 1289 హెక్టార్లలో పంటలను నష్టపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు.

అనంతసాగరం మండలంలోనే అత్యధికంగా 1054 హెక్టార్లలో పంట నష్టం సంభవించిందని, ముఖ్యంగా వరి పంట తీవ్రంగా దెబ్బతిన్నదని మంత్రి తెలిపారు. మొక్కజొన్న, మిరప, నిమ్మ, పొగాకు పంటలు కూడా కొంత మేర ప్రభావితమయ్యాయని చెప్పారు.

రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో తక్షణమే కచ్చితమైన ఎన్యుమరేషన్ పూర్తి చేసి నివేదికను కలెక్టర్‌కు అందించాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపించి, మార్గదర్శకాల మేరకు సకాలంలో నష్టపరిహారం అందిస్తామని పేర్కొన్నారు. కౌలు రైతులను కూడా ఆదుకుంటామని స్పష్టం చేశారు.

ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడులతో పంట నష్టం అంశంపై చర్చించామని, రైతులకు సహాయం చేయడంలో వారు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు.

రైతులు ఎవరు అధైర్యపడొద్దని, వారి కష్టానికి తప్పకుండా న్యాయం చేసి త్వరలోనే నష్టపరిహారం అందజేస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి నర్సింజి రావు, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఆర్డీవో పావని, తహసీల్దార్ పద్మజ, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారూ

డ్రగ్స్ అంతం ప్రజా సంఘాల పంతం

మనుబోలు మార్చి 23 ప్రభాతవార్త : గంజాయి,డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు అందరు కృషి చేయాలని డివైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం ఈ రమణ కోరారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డ్రగ్స్ అంతంప్రజా సంఘాల ఆధ్వర్యంలో డ్రగ్స్ అంతరం ప్రజా సంఘాల పంతం అన్న నినాదంతో చేపట్టిన కళాజాత సోమవారం మనుబోలుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు డ్రగ్స్ వల్ల యువత జీవితాలు నాశనం అవుతున్నాయి అన్నారు. ఈకార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహులు, ఐద్వా జిల్లా అధ్యక్షులు శివకుమారి కార్యదర్శి మస్తానమ్మ, నాయకులు షాహినా బేగం దేవదానం బిసి బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి పరామర్శలు

మనుబోలు మార్చి 23 ప్రభాతవార్త : మనుబోలు మండలం పిడూరు పాలెంలోని సినియర్ టిడిపి నేత వెంకట కృష్ణారెడ్డి, ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సోమిరెడ్డి సోమవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. అదే విధంగా వెంకన్నపాళెం బిజెపి మండల అధ్యక్షులు వాసిరెడ్డి రామిరెడ్డి తండ్రి రంగారెడ్డి ఇటీవల మృతి చెందారు.ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి వాసిరెడ్డిని పరామర్శించారు .అనంతరం ఇదే గ్రామంలో టిడిపి నేత దయాకర్‌రెడ్డి తల్లి దొరసానమ్మ మృతి చెందడంతో ఎమ్మెల్యే సోమిరెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి మండల అధ్యక్షులు పి రామకృష్ణయ్య, అడపాల శివకుమార్‌రెడ్డి ,శేఖర్ నాయుడు, హనుమంతనాయుడు, మహేంద్ర తదితర టిడిపి నాయకులు ఉన్నారు.

దొడ్ల కోదండరామిరెడ్డి చొరవతో సచివాలయానికి కూలు సున్నం ఏర్పాటు

బుచ్చి మార్చి 23 ప్రభాతవార్త : బుచ్చిరెడ్డిపాళెం సీనియర్ టిడిపి నాయకులు దొడ్ల కోదండ రామిరెడ్డి దాతృత్వంతో సచివాలయం-1 రేకులకు కూల్ సున్నం వేయడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. నిన్న మొన్నటి వరకు ఎండ వేడికి అల్లాడిపోయిన సిబ్బంది, కోదండ రామి రెడ్డి చొరవతో రేకులకు కూల్ సున్నం వేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోదండరామిరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

గ్రీవెన్స్‌కు ఫిర్యాదుల వెల్లువ

నెల్లూరు క్రైం, మార్చి 23, ప్రభాతవార్త : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో 127 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని, ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. అనంతసాగరంకు చెందిన మహిళ, సజ్జాపురం గ్రామానికి చెందిన చల్లా అజయ్ అనే వ్యక్తి తనను ప్రేమ పేరుతో వేదిస్తున్నాడని గతంలో తనతో ఉన్న పరిచయంతో తీసుకున్న ఫోటోలు అందరికి పంపుతానని బెదిరిస్తున్నట్లు పెళ్ళి చేసుకోవాలని వెంటపడి వేదిస్తున్నట్లు విచారించి న్యాయం చేయమని పిర్యాది కోరారు. నవాబుపేటకు చెందిన మహిళా,తనకు వివాహం జరిగినట్లు అదనపు కట్నం కోసం తన భర్త, అత్త ఇంటి వారు వేదిస్తునట్లు తన భర్త తనకు విడాకులు ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు విచారించి తగిన న్యాయం చేయమని కోరారు. అల్లూరుకు చెందిన మహిళ, అదే గ్రామానికి చెందిన సుధీర్ అనే వ్యక్తి చెడు ఉద్దేశంతో వేదిస్తున్నట్లు తను ఎక్కడికి వెళితే అక్కడికి వస్తునట్లు తనకి తన తమ్ముడుకి హాని చేయాలని చూస్తున్నట్లు అతని నుంచి తమకు భద్రత కల్పించాలని పిర్యాది కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి సిహెచ్ సౌజన్య, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస రావు, మహిళా స్టేషన్ డీఎస్పీ యు.సత్యనారాయణ, సీఐ సుబ్బారావు, కంట్రోల్ రూమ్ సీఐ భక్తవత్సల్ రెడ్డి, ఎస్‌బి 2 సీఐ శ్రీనివాస రెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- దళారుల దోపిడీపై ఆగ్రహం

తోటపల్లి గూడూరు, మార్చి 23, ప్రభాతవార్త: రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పూర్తి స్థాయిలో అమలు చేసి, దళారుల దోపిడీని అరికట్టాలని సిపిఎం పార్టీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేశాయి. ఈ మేరకు తోటపల్లి గూడూరు మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద రైతులు, సిపిఎం నాయకులు కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించి ఎంఆర్‌ఓ, వ్యవసాయ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ఇసుకపాలెం శాఖ కార్యదర్శి బండి శౌరి ఆధ్వర్యంలో మండల రైతు సంఘం నాయకత్వం చింతా రామసుబ్బయ్య, రాధయ్య నిర్వహించారు. మండలంలో వరి కోతలు ప్రారంభమై దాదాపు 20 రోజులు గడిచినా, రైతులకు సరైన ధర అందడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం పుట్టి ధాన్యం ధర సుమారు రూ. 23,500 ఉండాల్సి ఉండగా, మార్కెట్‌లో దళారులు సిండికేట్‌గా మారి కేవలం రూ. 17,000 నుంచి రూ. 18,000 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. తేమ శాతం పేరుతో, ఇతర సాకులతో రైతులపై అన్యాయం చేస్తూ క్వింటాకు, పుట్టికి భారీగా కోతలు విధిస్తున్నారని, దీని వల్ల సాగు ఖర్చులు కూడా తిరిగి రాక రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సమయానికి స్పందించకపోవడం వల్ల రైతులు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి, రైతులకు పూర్తి మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోళ్లలో దళారుల ప్రమేయాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. అలాగే మిల్లుల వద్ద తూకాల్లో జరుగుతున్న అక్రమాలు, అదనపు తరుగు వంటి దోపిడీలను కట్టడి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కొండయ్య, కంది పాటి రమణమ్మ, వీరయ్య, ఏసుదాసు, వెంకటేశ్వర్లు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

స్మశానం ప్రహరీ గోడ ధ్వంసం

ఇందుకూరుపేట, మార్చి 23, ప్రభాతవార్త : ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరు హరిజనవాడలో స్మశాన ప్రహరీ గోడను అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారు. ప్రహరీ గోడ ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ మురళికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రహరీ గోడ నిర్మించి పదేళ్ల గడిచిన అప్పుడు లేని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. దేవుడు మాన్యం భూములకు దారి సాకుతో ప్రహరీ గోడను ధ్వంసం చేయడం దారుణం అన్నారు. ఎస్సీ కులాల స్మశానం కాబట్టే వివక్ష చూపిస్తున్నారని మండిపడ్డారు. ఒక అగ్ర కులానికి చెందిన వ్యక్తి ఈ దారుణానికి ఒడిగట్టారని ఆరోపించారు. ప్రశాంతమైన తమ ఊరిలో విధ్వంసం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోచర్ల సురేంద్ర, ఈదురు విజయ భాస్కర్, పాలెపురాదయ్య, తువ్వర పూర్ణ చందు, పెడకాల రమేష్, ఈదురు వాసు, బొచ్చుమల్లి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ

కోవూరు, మార్చి 23 ప్రభాతవార్త : కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో చైత్రమాస సోమవారం స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నుల పండువగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో శివభక్త బృందం సభ్యులు సురేష్, సుకుమార్, నాగరాజు, మోహన్, భక్తులు ఉన్నారు.

25న కొండ బిట్రగుంటలో పశ్చిమ రాజగోపుర నిర్మాణానికి భూమి పూజ

బిట్రగుంట మార్చి 23 ప్రభాతవార్త : బోగోలు మండలం కొండ బిట్రగుంట లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పశ్చిమ భాగంలో నూతన రాజ గోపుర నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహనాధికారి ఆరవ. రాధాకృష్ణ తెలిపారు. ఈ నూతన రాజగోపురం నిర్మాణాన్ని స్వర్గీయ అమర బచ్చు చారిటబుల్ ట్రస్ట్ తరుపున ట్రస్టీ బచ్చు కృష్ణకుమార్, సంధ్య దంపతులు దాతలు గా వ్యవహరిస్తున్నారని ట్రస్ట్ తరుపున ఈ నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో కావలి శాసన సభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ముఖ్య అతిధిగా హాజరు కానున్నారని పేర్కొన్నారు .

ధర్నా కరపత్రాల ఆవిష్కరణ

కోవూరు, మార్చి 23 ప్రభాతవార్త : సీపీఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఈ నెల 24వ తేది కోవూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఇళ్ల స్థలాల కోసం జరిగే ధర్నా కార్యక్రమంకు సంబంధించి గోడ పత్రికలను సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్. రమణయ్య,నియోజకవర్గ కార్యదర్శి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల లేని నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇవ్వాలన్నారు. అదేవిధంగా స్థలం ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఇళ్ల సక్రమంగా నిర్మించకుండానే కోట్ల రూపాయలు స్వాహా చేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని ధనాన్ని రికవరి చేయాలన్నారు. సీపీఐ పేదల పక్షాన ఉండి పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డి. కామేశ్వరరావు, నేతలు లక్ష్మయ్య, మాధవి, సుమతి, అజయ్, తదితరులు ఉన్నారు.

రికవరీపై వీవోఏలు ప్రత్యేక దృష్టి పెట్టాలి

కోవూరు, మార్చి 23 ప్రభాతవార్త : బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లించేలా పొదుపు గ్రూపుల్లో మరింత అవగాహన పెంచేలా వీవోఏలు ప్రత్యేక దృష్టి పెట్టాలని వెలుగు సీసీ మురళి అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో వీవోఏలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను పూర్తిస్థాయిలో స్వయం ఉపాధి రంగాలపై పెట్టి అభివృద్ధిలోకి పయనించాలన్నారు. ఈ మేరకు పొదుపు గ్రూపు మహిళల్లో మరింత అవగాహన కల్పించి ప్రతి మహిళ పూర్తిస్థాయిలో అక్షరాస్యులు కావాలన్నదే ప్రభుత్వ ఆశయమని, ఆ దిశగా వీవోఏలు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో వీవోఏలు, తదితరులు ఉన్నారు.

చౌకచర్లలో రైతులకు ఆత్మ ఆధ్వర్యంలో శిక్షణ: ఎంఏఓ శ్రీలక్ష్మీ

విడవలూరు, మార్చి 23, ప్రభాతవార్త : మండలం చౌకచర్ల గ్రామంలో ఆత్మ సౌజన్యంతో సోమవారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు వరి పంట యాజమాన్యానికి సంబంధించిన ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించారు.మండల వ్యవ సాయ అధికారి సిహెచ్. శ్రీలక్ష్మీ మాట్లాడుతూ వరి పంట లో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతు లను వివరించారు. ముఖ్యంగా వరి కోత కోయడానికి సుమారు 10 రోజుల ముందు గ్రామ వ్యవసాయ సహాయక అధికారి వద్ద షెడ్యూల్ చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఇలా చేయడం వల్ల కోత ప్రక్రియ సజావుగా సాగుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భవనాజ్ నవధాన్యాల సాగు విధానాలు, వాటి ఉపయోగాలు గురించి రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖర్చులు తగ్గడంతో పాటు ఆరోగ్యకరమైన దిగుబడులు పొందవచ్చని తెలిపారు. అలాగే పంటలకు వ్యాధి నిరోధకత పెంచేందుకు ఉపయోగపడే సూడోమోనాస్‌ను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మం రైతులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఏ. అనూష,వి ఏ ఏ చాద్విక, గ్రామ సర్పంచ్ వినోద్ కుమార్, కార్యదర్శి షరీఫ్, అదేవిధంగా రైతులు పోలిరెడ్డి. అశోక్‌రెడ్డి, కొమ్మిరెడ్డి మురళి రెడ్డి, కొల్లు వెంకయ్య, సుధీర్, సనత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మండల ప్రజా పరిషత్ నూతన భవనంను

ప్రారంభించిన ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి, మార్చి 23, ప్రభాతవార్త : ఉదయగిరి పట్టణంలో మండల ప్రజా పరిషత్ నూతన కార్యాలయ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పాల్గొని నూతన భవనాన్ని ప్రారంభించారు. ఆధునిక సౌకర్యాలు, పరిపాలన అవసరాలకు అనుగుణంగా నిర్మించబడిన ఈ కార్యాలయం మండల అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. ఈ నూతన భవనం మొత్తం రూ.83.68 లక్షల వ్యయంతో నిర్మించబడింది. ఇందులో జిల్లా పరిషత్ గ్రాంట్ నుంచి రూ.36.20 లక్షలు, అలాగే మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మిగతా నిధులను వినియోగించి భవన నిర్మాణం చేపట్టారని, ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని కార్యనిర్వ హణలో సౌలభ్యం కల్పించేలా, అధికారులకు, ప్రజలకు అనుకూలమైన విధంగా ఈ కార్యాల యాన్ని అధునాతన హంగులతో తీర్చిదిద్దడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలిచే మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఇలాంటి ఆధునిక భవనంలో కార్యకలాపాలు నిర్వహించడం ఎంతో శుభపరిణామమని అన్నారు. పరిపాలనా వ్యవస్థ బలోపేతానికి, ప్రజలకు సేవలు మరింత వేగవంతంగా అందించడానికి ఇలాంటి మౌలిక వసతులు ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యాలయాలు బాగుంటేనే పరిపాలన కూడా అంతే పారదర్శకంగా, సమర్థవం తంగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజా సేవకు అంకితభావంతో పని చేసే అధికారులు, సిబ్బంది కార్యాలయాన్ని పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచుకోవడం తమ బాధ్యతగా భావించాలని సూచించారు. ప్రభుత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగేలా ప్రతి ఉద్యోగి సేవాభావంతో వృత్తి ధర్మాన్ని నిబద్ధతతో నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రాంభోత్సవ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, సిబ్బంది పార్టీ నాయకులు, స్థానిక ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో కట్టడాలను నిలిపివేయాలి

కావలి, మార్చి 23 ప్రభాతవార్త : మాదిగలకు సంబందించిన ప్రభుత్వ భూమిలో చేపడుతున్న కట్టడాలను వెంటనే నిలిపివేయాలని ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు చేవూరు కిరణ్‌కుమార్ తెలిపారు. పద్మశ్రీ మందక్రిష్ణమాదిగ ఆదేశాల మేరకు సోమవారం కావలి ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగల భూముల విషయంపై ధర్నా చేసి ఆర్డీఓకు వినతిపత్రం అంద జేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దగదర్తి మండలం ఉలవపాళ్ళ గ్రామంలోని 61సర్వేనెంబర్‌లో పెద్దవాగును గ్రావెల్తో పూడ్చి అదే గ్రామానికి చెందిన షేక్ రఫి, షేక్ నాగూర్ కుటుంబసభ్యులు, అనుచరులు కలిసి ఆక్రమణలు చేసుకొని అక్రమ కట్టడాలు చేపట్టి నట్లు తెలిపారు. 61వ సర్వేనెంబర్, 63వ సర్వేనెంబర్లకు సంబంధించి సరిహద్దురాళ్లను తొలగించారని కలెక్టర్, తహశీల్దార్‌లకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షులు అక్కిలి గుంట ఏసుమాదిగ, ఎంఈఎఫ్ జాతీయ నాయకులు మంద వెంకటేశ్వర్లు మాదిగ, కొప్పర్తి కొండయ్య బోగోలు మండల ఇన్‌చార్జ్ యేసు పోగు జయరాజుమాదిగ, దగదర్తి మండల ఇన్‌చార్జ్ కావలి శ్రీనివాసులు మాదిగ, అల్లూరు పట్టణ అధ్యక్షులు దర్శగుంట కోటయ్యమాదిగ, మండల అధ్యక్షులు కర్రమల్లి కార్జున మాదిగ, జిల్లా నాయకులు వాసుమాదిగ, పట్టణ అధ్యక్షులు చేవూరు వరప్రసాద్ మాదిగ, పట్టణ నాయకులు మావులూరి సాల్మన్ మాదిగ, చక్కెర సీనయ్య, మంచు తిరపతయ్య, ఉలవపాళ్ళ గ్రామస్థులు పాల్గొన్నారు.

చింతలదేవి పారానికి గడ్డి సరఫరా టెండర్‌కు ఆహ్వానం

కావలి, మార్చి 23 ప్రభాతవార్త : కొండాపురం మండలం, చింతలదేవిలోని జాతీయ కామదేను సంతాన ఉత్పత్తి కేంద్రానికి 578మెట్రిక్ టన్నుల మిషన్‌తో కోసిన ఎండు గడ్డిని సరఫరా చేసేందుకు టెండర్లను ఆహ్వానించడం జరిగిందని కామదేను సంతానోత్పత్తి కేంద్ర ఇన్‌చార్జ్ జేడి ఎస్‌కె.సి.డాక్టర్ మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19నుండి ఏప్రిల్ 2వరకు దీనికి సంబంధించిన పీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 4న జిల్లా జేసి సమక్షంలో ఈ టెండర్లను తెరవడం జరుగుతుందని తెలిపారు.

టిడిపి నేత మెట్టు విజయకృష్ణారెడ్డికి మాతృవియోగం

సంగం మార్చి 23 ప్రభాతవార్త : సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామానికి చెందిన టిడిపి నేత మెట్టు విజయకృష్ణారెడ్డికి మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి మెట్టు ప్రసన్నమ్మ (65) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతు సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకొని పలువురు టిడిపి నేతలు ఆయనను పరామర్శిస్తున్నారు.

నేటి యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి

కావలి, మార్చి 23 ప్రభాతవార్త : స్వాతంత్ర్య సమరయోదుడు త్యాగశీలి భగత్ సింగ్‌ను స్పూర్తిగా తీసుకొని నేటి యువత దేశభక్తిని పెంచుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ప్రముఖ సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండరెడ్డి తెలిపరు. భగత్‌సింగ్ సుఖదేవ్ రాజ్ గురులు బ్రిటీష్‌పాలకులు వ్యతిరేకంగా పోరాడి ఉరికంభం ఎక్కిన గొప్ప దేశభక్తులని తెలిపారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా వారిని నేటి యువత స్పూర్తిగా తీసుకోవాలని తెలిపారు.భగత్‌సింగ్ రాజుగురు సుఖదేవుల త్యాగాలను కొనియాడారు. వారికి అనంతరం నివాళ ఎలర్పించారు.

జాతీయ టి.బి నిర్మూలన దినోత్సవం

సీతారామపురం మార్చి 23 ప్రభాతవార్త జాతీయ టి.బి నిర్మూలన దినోత్సవం సందర్భంగా టిబి నిర్మూలనలో భాగంగా విద్యార్థులతో ఆరోగ్యకేంద్రం సబ్బంది ర్యాలీగా వచ్చి సీతారామపురం బస్టాండ్ కూడలి వద్ద మాన వహారం నిర్మించారు మెడికల్ ఆఫీసర్ ఎ.స్వప్న మాట్లాడుతు జిల్లా లెప్రసి టిబి అధికారి డాక్టర్ ఎస్‌కె ఖాదర్‌వలీ ఆదేశాల ప్రకారంటిబి నిర్మూలన దినోత్సవ ర్యాలీ మానవహారం ,నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నికిల్,టిబి సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు,గౌతమి హైస్కూల్ హెడ్‌మాష్టార్ బాస్కర్‌రెడ్డి, పిహెచ్‌సి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పల్లిపాడులో ఘనంగా ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ఇందుకూరుపేట, మార్చి 23, ప్రభాతవార్త కోవూరు నియోజకవర్గ శాసనసభ సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాల(చిన్నబడి) నందు సోమవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వ హించారు. వాసన్ ఐ కేర్ హాస్పి టల్ వారి సౌజన్యంతో ప్రముఖ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేయ బడింది. ఈ శిబిరానికి గ్రామస్తుల నుండి విశేష స్పందన లభించింది. సుమారు 80 మందికి పైగా గ్రా మస్తులు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్య బృందం సభ్యులు మాట్లాడుతూ దృష్టి లోపాలతో బాధపడుతున్న వారికి తగిన సలహాలు, సూచనలు అందించారు. కంటి ఆపరేషన్లు అవ సరమైన వారికి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి ఉచితంగా శస్త్ర చికి త్సలు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు వెంకటేశ్వర్లు, నువ్వూరు హరీష్, చింతపంటి సుబ్రహ్మణ్యం, చింతపంటి వెంకట రమణయ్య, నువ్వూరు మహేష్, చింతపంటి దయాకర్, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో జాతిపిత శ్రీదొమ్మేటి వెంకటరెడ్డి 174వ జయంతి వేడుకలు

ఉదయగిరి, మార్చి 23, ప్రభాతవార్త ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో నేడు శెట్టి బలిజ కుల జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి 174వ జయంతిని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి ఘనంగా నిర్వహించి వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిం చారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థి కార్యకలాపాల అధికారి గోపికృష్ణ , ఇతర విభాగాధిపతులు డాక్టర్ జి.రఘునాథరెడ్డి, డాక్టర్ ఎం.సునీత, డాక్టర్ ఏవీఎస్ దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం.కిషన్ తేజ్, కళాశాల పరిపాలన అధికారిణి కుమారి, ఎం.కమల ప్రియ, బోధనేతర సహాయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి వారి ఘన చరిత్రను వివరిస్తూ, ఒమ్మేటి వెంకటరెడ్డి జీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

150 మంది క్యాన్సర్ రోగులకు పౌష్టికాహారం

నెల్లూరు రూరల్ మార్చి23 ప్రభాతవార్త: కొండాయపాలెంలో అబైడింగ్ హోప్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్యాన్సర్ రోగుల కోసం నిర్వహించిన పౌష్టికాహార సహాయ కార్యక్రమం హృదయాన్ని తాకింది. మార్చి 23న నిర్వహించిన ఈ కార్యక్రమంలో చికిత్స పొందుతున్న 150 మంది రోగులకు పౌష్టికాహారం అందజేసి, వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేలా సహకారం అందించారు. రోగులు చికిత్సకు మెరుగైన ప్రతిస్పందన చూపించేందుకు, వేగంగా కోలుకునేందుకు ఈ కార్యక్రమం ప్రధానంగా దోహదపడుతోంది. ఈ సందర్భంగా డాక్టర్ పెట్ల జోషువా కిషోర్ మాట్లాడుతూ, క్యాన్సర్ చికిత్సలో పౌష్టికాహారం అత్యంత ముఖ్యమని, ఇది రోగుల కోలుకునే వేగాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా నిరంతరంగా సేవలు అందిస్తున్న ట్రస్ట్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. నారాయణ హాస్పిటల్‌కు చెందిన ఆంకాలజిస్ట్ డా. ప్రియా మాట్లాడుతూ, క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం, సమయానికి చికిత్స అందించడం, అలాగే సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధిని నియంత్రించడమే కాకుండా, కొన్ని సందర్భాల్లో పూర్తిగా నయం చేయవచ్చని వివరించారు. అబైడింగ్ హోప్ ట్రస్ట్ డైరెక్టర్ డా. టైటస్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ, క్యాన్సర్ చికిత్సలో సమగ్ర దృష్టికోణం అవసరమని, వైద్య చికిత్సతో పాటు పౌష్టికాహారం, మానసిక ధైర్యం కూడా సమానంగా ముఖ్యమని చెప్పారు. ట్రస్ట్ గత నాలుగు సంవత్సరాలుగా అందిస్తున్న పౌష్టికాహార సహాయం వల్ల రోగుల ఆరోగ్యం, జీవన ప్రమాణం గణనీయంగా మెరుగుపడిందని తెలిపారు. సిస్టర్ రమ, జయ,బాబు, శశి తదితర స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొని సేవలందిం చారు. సమాజంలో అవసరమైన వారికి చేయూతనందించే ఈ కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంది.

సిఐని కలిసిన టిఎన్‌టియుసి మండల అధ్యక్షులు సిద్దయ్య



ముత్తుకూరు, మార్చి 23, ప్రభాతవార్త కృష్ణపట్నం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కె.రఘుబాబును టిఎన్‌టియుసి మండల అధ్యక్షుడు తిన్నెలపూడి సిద్దయ్య ఆధ్వర్యంలో ముత్తుకూరు మండలం పంటపాలెం పంచాయితీకూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. సిఐని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.బిజేపి మండలఉపాధ్యక్షుడు తాళ్ళూరు వెంకటరమణయ్య నాయుడు, టిడిపి నాయకులు ఎస్‌కె మోహినుద్దిన్, భాస్కర్ రెడ్డి, మన్సూర్, నాగేంద్ర తదితరులు ఉన్నారు.

దుర్గంపల్లి విద్యార్థికి టీచర్లు అభినందనలు

ఉదయగిరి, మార్చి 23, ప్రభాతవార్త ఉదయగిరి మండల పరిధిలోని దుర్గంపల్లి మండల పరిషత్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బకీర్ ప్రీతిక్ ఇటీవల విడుదలైన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలలో ప్రతిభ చూపి తన సత్తా చాటి సీటు సాధించారు. అందుకు స్కూల్ తరుపున హెడ్ మాస్టర్ హజరత్ టీచర్ రామకృష్ణ గ్రామస్తులు ఆ విద్యార్థిని అభినందించారు. టీచర్లు మాట్లాడుతూ సీటు సాధించడంతో పాఠశాలకు మంచి పేరు వచ్చిందన్నారు. అందుకు ఆ విద్యార్థికి అభినందనలు తెలుపుతున్నామని తెలిపా రు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మన పాఠశాల విద్యార్థి నవోదయ ఎంట్రన్స్ ఫలితాలలో సీటు సాధిం చడం పాఠశాలకు, మన గ్రామానికి గర్వకారణం అని పేర్కొన్నారు.

స్మార్ట్ టెక్నాలజీతో స్ట్రీట్ లైట్లు

నెల్లూరు, మార్చి 23, ప్రభాతవార్త -వైద్యం జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కే.రాఘవేంద్రం విద్యుత్ భవన్‌లో ఒక ప్రకటనలో మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలందరికి తెలియజేయడమేమనగా.. ఇకపై జిల్లాలోని అన్ని వీధి దీపాలు ప్రతిరోజు సాయంత్రం 5.30గంటలకు ఆటోమేటిక్‌గా వెలిగించబడతాయి. ఉదయం 6గంటలకు ఆటోమేటిక్‌గా ఆఫ్ చేయబడతాయి. ఈ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లాలోని ప్రతి స్ట్రీట్ లైట్ కనెక్షన్‌కు స్మార్ట్ మీటర్లు అమర్చబడినవి. ఈ స్మార్ట్ మీటర్లలోని ప్రత్యేక సాంకేతికత ద్వారా నిర్ణీత సమయాలకు వీధి దీపాలు స్వయంచాలకంగా ఆన్ ఆఫ్ అవుతాయి. ఇందుకోసం ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ వ్యవస్థ రూపొందించబడింది.

ప్రజలకు ముఖ్యమైన సూచనలు: ఈ విధానం అమలులోకి వచ్చిన తరువాత, ఎక్కడైనా వాటర్ వర్క్స్‌కు ఇబ్బంది కలిగినట్లయితే ఉదాహరణకు, ఆఫ్ చేసిన సమయంలో ఆఫ్ కావడం, ఆన్ కావాల్సిన సమయంలో ఆఫ్‌లో ఉండడం ఇలాంటి సమస్యలు వస్తే సంబంధిత విషయాన్ని అసిస్టెంట్ ఇంజనీర్ లేదా డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కి వెంటనే తెలియజేయాలన్నారు. సమాచారం అందిన వెంటనే సంబంధిత కనెక్షన్లు వేరు చేసి, వాటర్ వర్క్స్‌లకు ప్రత్యేకంగా సెపరేట్ మీటర్లు ఏర్పాటు చేయబడతాయి. ఈ విధానం ఇకపై ప్రతి రోజు ఇదే విధంగా కొనసాగనుంది. కాబట్టే వాటర్ వర్క్స్ సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని సూపరింటెండింగ్ ఇంజనీర్ విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ కార్మికులకు 14 రోజుల సమ్మెకాలం జీతాలు ఇవ్వాలి

నెల్లూరు కార్పోరేషన్, మార్చి 23 ప్రభాతవార్త : ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు 14రోజుల సమ్మెలకలం జీతాలు చెల్లిం చాలని డిమాండ్ చేస్తూ నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ.నందన్‌కు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం వినతిపత్రం అందజేశారు. సిఐటి యు నాయకులు కత్తి శ్రీనివాసులు, కె.పెంచల నరసయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమ్మెకాలం జీతాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 6న జీఓ జారీ చేసి దాదాపు రెండునెలలు కావస్తున్నా నగరకార్పోరేషన్ అధికారులు మాత్రం మున్సిపల్ కార్మికులకు జీతాలు ఇవ్వలేదన్నారు. ఇప్పటికే అనేక దఫాలుగా మున్సిపల్ అధికారులు కలసి సమస్యను తెలియజేసినా ఏదో ఒక సాకుతో తప్పించుకుంటున్నారన్నారు. ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చిన కార్పోరేషన్ అధికారుల వ్యవహారశైలీ సరిగాలేదన్నారు. డ్రైవర్స్‌కు యూనిఫామ్, సోపులు, నూనెలు, ఇవ్వడం లేదన్నారు. వాహనాల రిపేర్లకు నోచుకోక డ్రైవర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు కొండా ప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సునీల్, అశోక్, వజ్రమ్మ, సుజాతమ్మ, మనోజ్, శ్రీనివాసులు, కామాక్షమ్మ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నం పెట్టే అన్నదాతలను ఆదుకోవాలని బిజెపి నిరసన

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 23, ప్రభాతవార్త : ధాన్యం మద్దతు ధరలు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతుందని బిజెపి నేతలు వరి కంకులు చేతబట్టి ధాన్యాన్ని రోడ్డుపై పోసి, కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి నేతలు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరిలు మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో రైతుల పండించిన అన్ని రకాల వరి ధాన్యం ధరలు దిగజారిపోయాయి.

కనీస మద్దతు ధర 20,300 రూపాయల కాగా, బిపిటి రకం దాన్యం 4వేల రూపాయలు. కేఎన్ఎమ్ రకం ధాన్యం 3000 రూపాయలు అన్నారు. రకం వేయి రూపాయలు నష్టానికి రైతులు విక్రయాలు చేసుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద మిల్లర్లు తేమసాకుతో పుట్టి 850 కేజీలు కాగా 960 కేజీలు రైతుల నుండి వసూలు చేస్తున్నారు. నెల్లూరు జిల్లాలో 50 శాతం మంది కవులు రైతులు వ్యవసాయం చేస్తున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక యజమానులకు కవులు చెల్లించి ఒట్టి చేతులతో ఇంటికి పోతున్నారు. నెల్లూరు జిల్లాలో తేమ పేరుతో రైతులు నష్టపోకుండా 2013 సంవత్సరం నుండి ప్రభుత్వ అధికార యంత్రాంగం ఒక సాంప్రదాయాన్ని కొనసాగిస్తుంది. 18 శాతం తేమకు గాను 100 కేజీలకు ఒక కేజీ అదనంగా, 20 శాతం తేమకు గాను 100 కేజీలకు మూడు కేజీలు మిల్లర్లు అదనంగా తీసుకునే సాంప్రదాయం ఉంది. నేడు ఆ సాంప్రదాయానికి తూట్లు పొడిచి మిల్లర్లు జిల్లా రైతాంగాన్ని నట్టేట ముంచుతున్నారు. ఆ సాంప్రదాయాన్ని తక్షణమే కొనసాగించి రైతులకు కనీస గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని ధర్నాలో పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైరి శ్రీనివాసులు, నరాల సుబ్బారెడ్డి. ముడమాల రమేష్ రెడ్డి, ఆదినారాయణ, విజయశ్రీ, చిట్టిబాబు, చింత గింజలు సుబ్రమణ్యం, మాల్యాద్రి, టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరులోని ఏటీఎంలకు ఏమైంది..?

పొదలకూరు, మార్చి 23, ప్రభాతవార్త : పొదలకూరులో పట్టణంలోని ఏటీఎంలకు ఏమైందోనని పలువురు చర్చించుకుంటున్నారు. సోమవారం ఒక్కసారిగా అన్ని బ్యాంకులకు సంబంధించిన ఏటీఎంలు పనిచేయడం లేదు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగదు అవసరంతో ఏటీఎంల వద్దకు వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణంలో ఉన్న కొన్ని ఏటీఎంల తలుపులు పూర్తిగా మూసివేసి ఉండగా, మరికొన్ని తెరిచి ఉన్నప్పటికీ క్యాష్ అందుబాటులో లేకపోవడంతో ఉపయోగం లేకుండా మారిపోయాయి. ఒక ఏటీఎంలో డిస్‌ప్లే సిస్టమ్ కూడా పనిచేయకపోవడం గమనార్హం. దీంతో ఏటీఎం పనిచేస్తుందా లేదా అన్నది వినియోగదారులకు అర్థంకాక ఇబ్బందులు మరింత పెరిగాయి. నగదు కోసం ప్రజలు పట్టణంలోని ప్రతి ఏటీఎం వద్దకు వెళ్లి ప్రయత్నిస్తూ తిరిగారు. ముఖ్యంగా రోజువారీ అవసరాల కోసం నగదుపై ఆధారపడే చిన్న వ్యాపారులు, కార్మికులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది అత్యవసర అవసరాల కోసం డబ్బు అవసరమైనప్పటికీ దొరకకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం, గత రెండు రోజులుగా వరుసగా బ్యాంక్ సెలవులు రావడం వల్ల ఏటీఎంలలో నగదు నింపే ప్రక్రియ జరగలేదని తెలుస్తోంది. దీంతో ఇప్పటికే ఉన్న క్యాష్ పూర్తిగా అయిపోయిందని అంటున్నారు. అయితే ఈ పరిస్థితిని ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంపై బ్యాంక్ అధికారులను ప్రశ్నించగా, సెలవుల కారణంగా నగదు రీఫ్లేస్ చేయడంలో ఆలస్యం జరిగిందని, త్వరలోనే అన్ని ఏటీఎంలలో క్యాష్ అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

గిరిజన బాలిక కుటుంబాన్ని పరామర్శించిన సిడిపిఓ

కోట, మార్చి 23 ప్రభాతవార్త : కోట మండలం చిట్టేడు గ్రామ గిరిజన కాలనీకి చెందిన ఓ బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇన్‌స్టాగ్రాం ద్వారా ఓ యువకుడితో ప్రేమలో పడిన ఆ బాలికను ఉగాది నాడు గుంటూరు జిల్లా గురజాలకు చెందిన యువ కులు తీసుకెళ్లారు. సోమవారం కోట ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి మునికుమారి, సూపర్‌వైజర్ కవిత చిట్టేడుకు వెళ్లారు. అయితే బాలిక తల్లిదండ్రులు అక్కడ అవమానభారం భరించలేక వారి బంధువులు ఉంటున్న గూడలి కొండమిట్ట కాలనీలో ఉండటంతో అక్కడికి వెళ్లారు. సమాచారం తెలుసుకున్న సిడిపిఓ వెళ్లి బాలిక తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాలిక తల్లిదండ్రులు సిడిపిఓతో మాట్లాడుతూ ఇద్దరు యువకులు రెండు బైకుల్లో వచ్చి తమ కుమార్తెను తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ధైర్యంగా ఉండండి, న్యాయం జరుగుతుందని సిడిపిఓ కుమారి ధైర్యం చెప్పి వచ్చారు.

రేషన్ డీలర్లకు 35 వేలు కమీషన్ ఇవ్వాలి

- హెల్త్ కార్డులను మంజూరు చేయండి - రేషన్ సరుకుల డోర్ డెలివరీ కష్టతరం - అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.గిరిజారావు

నెల్లూరు అగ్రికల్చర్, మార్చి 23, ప్రభాతవార్త : అతి తక్కువ కమీషన్‌తో పేదలకు రేషన్ సరుకులు అందిస్తున్న డీలర్లకు ప్రభుత్వం ఇచ్చే కమీషన్‌ను 35వేలకు పెంచి రాష్ట్రంలోని డీలర్‌లందరికి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని చౌక ధరల దుకాణదారుల సంఘాల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎం.గిరిజారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా రేషన్ డీలర్లతో కలిసి నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎన్ఎస్ అనూష కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రేషన్ డీలర్లు అతి తక్కువ కమీషన్‌తో ప్రభుత్వం ఆదేశించిన విధంగా ప్రజలకు రేషన్ సరుకులను అందిస్తున్నామన్నారు. డీలర్లకు ఇచ్చే కమీషన్ ఎంతో తక్కువని, దీనికి తోడు దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం డోర్ డెలివరీని ప్రవేశపెట్టి డీలర్లను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. డీలర్లలో 70 ఏళ్ల పైబడిన వారు కూడా ఉన్నారని, అలాంటివారు డోర్ డెలివరి చేయాలంటే అవస్థలు పడుతున్నామని, అంతే కాకుండా సరుకులు తీసుకెళ్తే లబ్దిదారులు ఇంటి వద్ద లేకపోవడంతో పలుమార్లు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, దీంతో రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రికి కూడా లేని సెక్యూరిటీ మాపై ఉందని, చౌక ధరల దుకాణాలకు వీఆర్వో, స్పెషల్ పోలీసు, విజిలెన్స్, పోలీసు ఇంత నిఘా అవసరమా అని ప్రశ్నించారు. రాత్రి 12 గంటలకు కూడా మా తలుపు తట్టి మా సంగతి ఏంటని అధికారులు ప్రశ్నించే పరిస్థితి ఉందని వాపోయారు. దేశంలో ఏ చిన్న ఉద్యోగిని ఏసీబీ పట్టుకున్నా వందల కోట్లు బయటపడుతున్నాయని ఇంత వరకు డీలర్ల మీద ఎలాంటి ఆరోపణలు లేవని, మాపై ఐటీ దాడులు కూడా లేవని, ఇంత నిజాయితీగా పేద, బడుగు బలహీన వర్గాలకు సేవలు అందిస్తున్నా ఆశించిన కమీషన్ ప్రభుత్వం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో 16 లక్షల కార్డులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందిస్తున్న ఘనత డీలర్లకు దక్కిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా డీలర్ల సంక్షేమం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పుడు ఇచ్చే అతి తక్కువ కమీషన్ కాకుండా, కొట్టు బాడుగ, గుమస్తా ఖర్చులు, తరుగు, రవాణా ఖర్చులను ప్రభుత్వమే భరించి రాష్ట్రంలోని డీలర్లు అందరికి 35 వేల రూపాయల కమీషన్ అందించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చౌక ధరల దుకాణదారుల సంఘాల సంక్షేమ సమాఖ్య నేతలు ఎంఎస్ చక్రధర్, ఎస్.నాగార్జున,తవ్వాసరస్వతి,బి.నాగిరెడ్డితదితరులు,పాల్గొన్నారు.

డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమానికి 9 ఫిర్యాదులు

నెల్లూరు, మార్చి 23, ప్రభాతవార్త-వైద్యం నెల్లూరు నందు ఆంధ్రప్రదేశ్ దక్షిణ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని డివిజన్ల మొత్తం 9 ఫిర్యాదులు అందినట్లు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కే.రాఘవేంద్రం తెలిపారు.

ఈ ఫిర్యాదులు ప్రధానంగా బిల్లింగ్ సమస్యలు, త్రీఫేజ్ కన్వర్షన్, లో వోల్టేజి సమస్యలు, వ్యవసాయ నూతన సర్వీసులు తదితర అంశాలకు సంబంధించినవిగా ఉన్నాయని వివరించారు. అందిన ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో తీసుకొని, సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లకు వెంటనే తెలియజేసి సమస్యల పరిష్కారం పూర్తైన అనంతరం ఫొటోలతో కూడిన నివేదికను సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. వినియోగదారుల సమస్యలను వేంగంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లకు తమ పరిధిలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్సీ/ ఎస్టీ ఉచిత సోలార్ విద్యుత్ పనులను ప్రతి రోజు పర్యవేక్షించాలని, పనుల నాణ్యతను పరిశీలించాలని, సామాగ్రిని తరుచుగా తనిఖీ చేయాలని, వెండర్ల వద్ద నుండి డైలీ ప్రోగ్రెస్ రిపోర్టు తీసుకోవాలని ఆదేశించారు. పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ టెక్నికల్ శేషాద్రి బాలచంద్ర, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్(టౌన్) శ్రీధర్, అసిస్టెంట్ ఇంజనీర్లు తిరుపతయ్య, నరసింహారావు పాల్గొన్నారు.

మా బిడ్డ ఆచూకీ తెలపండి

- గిరిజన బాలిక తల్లిదండ్రుల ఆవేదన

కోట, మార్చి 23 ప్రభాతవార్త : కోట మండలం చిట్టేడు గ్రామంలో మైనర్ బాలిక ఇన్‌స్టాగ్రాం ద్వారా పరిచయమైన ఓ యువకుడితో ఐదురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆ మేరకు బాలిక తల్లిదండ్రులు కోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే తమ బిడ్డ ఎక్కడ ఉందో, ఏమయిందో అని బాలిక తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అధికారులు చొరవ తీసుకుని తమ బిడ్డను తమకు అప్పగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. బాలిక తల్లిదండ్రులు చిట్టేడు స్వగ్రామమైనప్పటికీ, అక్కడ అవమానభారం భరించలేక గూడలి కొండమిట్ట కింద కాలనీలో బంధువుల ఇళ్ల వద్ద ఉంటున్నారు.

మైనర్ బాలిక ఆచూకీ కోసం గాలింపు

కోట, మార్చి 23 ప్రభాతవార్త : కోట మండలం చిట్టేడు గ్రామంలో గిరిజన బాలిక అదృశ్యంపై పూర్తిస్థాయిలో గాలింపు చర్యలు చేపట్టామని ఎస్ఐ పవన్‌కుమార్ చెప్పారు. సోమవారం ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ తమకు వచ్చిన ఫొటోలు ఆధారంగా గుంటూరు జిల్లా గురజాల ప్రాంతానికి ఇద్దరు కానిస్టేబుళ్లను పంపించామని చెప్పారు. పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు.

రైతులకు పూర్తిస్థాయిలో సహకరించాలి

కోవూరు, మార్చి 23 ప్రభాతవార్త : కోవూరు మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు పూర్తిస్థాయిలో సహకరించాలని మండల ప్రత్యేక అధికారి, మార్కెటింగ్ ఏడీ అనిత తెలిపారు. కోవూరులోని శాంతి నగర్‌లో ఉన్న పడుగుపాడు సహకార సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర అందించేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. ముఖ్యంగా రైతులకు కావాల్సిన గోతాలు, లారీలు, సకాలంలో వారికి అందేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తేమశాతం, నాణ్యతా ప్రమాణాల విషయంలో నిర్దేశించిన వాటిని పాటించాలన్నారు. అనంతరం రైల్వే రోడ్డులో ఉన్న ఎస్ఎల్ఎస్ రైస్ మిల్లును కూడా పరిశీలించి సీఎంఆర్ విషయమై రైస్ మిల్లు యాజమాని సురేంద్రతో చర్చించారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి రైస్ మిల్లర్లు సీఎంఆర్ అనుసరించాలన్నారు.రైతుల నుంచి లారీలో వచ్చిన ధాన్యాన్ని సకాలంలో అన్‌లోడ్ చేసేలా మిల్లర్లు సహకరించాలన్నారు. అదేవిధంగా గోతాలు సకాలంలో పీపీసీ సెంటర్లకు పంపించాలని ఈ సందర్భంగా ఆయన మిల్లర్లకు సూచించారు. ఇంకా ఎవరైనా బ్యాంక్ గ్యారెంటీ పెండింగ్ ఉంటే వారు వెంటనే క్లియర్ చేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ పరిశీలనలో కోవూరు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ బాలకోటమ్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చిరంజీవి, సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

తహసిల్దారు కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు

బుచ్చి మార్చి 23 ప్రభాతవార్త : బుచ్చిరెడ్డిపాళెం తహసిల్దారు కార్యాలయంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో వుంచుకొని తహసిల్దారు అబ్బుటి వెంకటేశ్వర్లు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నిత్యం కుండలలో నీళ్ళు పోయడం వల్ల కార్యాలయానికి వచ్చిన ప్రజల దాహం తీరుతుందని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటి తహసిల్దారు మల్లికార్జున ,ఆర్ఐ శాంతకుమారి, కార్యాలయం సిబ్బంది, విఆర్ఓలు పాల్గోన్నారు.

కావలిలో గ్యాస్ కష్టాలు

కావలి, మార్చి 23 ప్రభాతవార్త : కావలి పట్టణం, గ్రామీణ ప్రాంతాలలో పలు గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారులకు గ్యాస్ అందక అష్టకష్టాలు పడుతున్నారు. సకాలంలో గ్యాస్ బుక్ చేసుకున్నా డెవలరీ బాయ్‌ల ద్వారా సక్రమంగా అందడం లేదని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. గృహాలకు ఉపయోగించే గ్యాస్ పక్కదారి పడుతోందని విమర్శలు ఉన్నాయి. పౌరసరఫరాలశాఖ అధికారులు నిద్రా వస్థలో ఉండడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు మాత్రం గ్యాస్ కొరత లేదని చెబుతు న్నట్లు పేర్కొన్నారు. బుక్ చేసుకుంటే ఓటిపి వచ్చిన వారికి గ్యాస్ ఇవ్వాలని చెపుతుంటే క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు. గ్యాస్ కొరత ఏర్పడడం వల్ల చిన్న హోటల్స్ ఇప్పటికే మూతపడి ఉపాధి కోల్పొయారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్యాస్ కష్టాలు తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఘనంగా భగత్‌సింగ్ రాజుగురు సుఖ దేవ్‌ల వర్ధంతి

కావలి, మార్చి 23 ప్రభాతవార్త : అమరవీరుల భగత్‌సింగ్ రాజుగురు,సుఖదేవ్‌ల స్పూర్తితో దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం గంజాయికి వ్యతిరేకంగా పోరాడుతామని డివైఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక కసాయివీధిలోని సిపిఎం కార్యాలయంలో భగత్‌సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన స్వాతంత్ర్య సమరయోదులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను నేటి యువత ఆదర్శంగా తసుకోవాలని తెలిపారు. డ్రగ్స్, గంజాయి మాఫియా తమవ్యాపారల లాభాల కోసం చిన్న పిల్లలు చదువే పాఠశాలలకు కూడా విస్తరింప చేశారు అన్నారు. భవిష్యత్తులో అమరవీరుల త్యాగాల స్పూర్తితో ఉద్యోగ ఉపాధి కల్పన కోసం మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం నిర్మూళన కోసం మెరుగైన సమాజం కోసం ముందుకు సాగుతామని తెలిపారు. పట్టణ కార్యదర్శి పెంచల నరసింహం, కె.చెన్నయ్య, జె.బాబు, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు విభజన పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలి

కోవూరు, మార్చి 23 ప్రభాతవార్త : ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం మండలంలోని అన్ని పంచాయతీల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి వార్డు విభజన పారదర్శకంగా చేపట్టేలా సచివాలయ ఉద్యోగులు తగు చొరవ తీసుకోవాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాల యంలో సోమవారం మండలంలోని అన్ని సచివాలయాలకు సంబంధించిన ఉద్యోగులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఈ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో డిప్యూటీ ఎంపీడీవోలు శ్రీనివాసులు, సురేష్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

లేగుంటపాడు గ్రామ పంచాయతీ కార్యాలయము

ఆర్.ఓ.సి.నెం.01/2026 తేది: 20.03.2026

టెండరు ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం, లేగుంటపాడు గ్రామపంచాయతీ 2026-2027 సం॥నకు ఈ క్రింది షెడ్యూల్లో తెలిపిన కార్మికులను కాంట్రాక్ట్ పద్దతి పై సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లలో పాల్గొనదలచిన వారు తేది: 30-3-2025 ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు లేగుంటపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు పంచాయతీ కార్యదర్శి వద్ద గాని లేదా వారి అనుమతి పొందిన వారి వద్ద గాని టెండర్లు ధాఖలు పరచవలేను. సదరు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం 3:30 గంటలకు హాజరు కాబడిన టెండర్ దారుల సమక్షంలో టెండర్లు తెరవబడును. ఈ దిగువ తెలిపిన షెడ్యూల్లో చూపిన ధరావత్తు చెల్లించి, టెండర్లు దాఖలు చేయవలెను. ధరావత్తు చెల్లించని టెండర్లు తిరస్కరించబడును. ఇతర వివరాల కొరకు కార్యాలయము పనిచేయు వేళలలో సంప్రదించగలరు.

వ. నెం.	టెండర్ వివరములు (తేది 01.04.2026 నుండి 31.03.2027 వరకు పనిచేయుటకు)	టెండర్ ధరావత్తు
1	కాంట్రాక్ట్ స్వీపర్లు-02, కాంట్రాక్ట్ PWS పంప్ ఆపరేటర్లు-02 మొత్తం (4)	రూ.200

సం/- షేక్ సలీమ్, పంచాయతీ కార్యదర్శి,
లేగుంటపాడు గ్రామ పంచాయతీ, కోవూరు మండలం.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఏం.వి.రమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బి

గూడూరు, మార్చి 23, ప్రభాతవార్త: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఏం.వి.రమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బిలు పేర్కొనారు. సోమవారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్‌కి జీపు జాతా చేరుకుంది. గూడూరు సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాల కట్టడిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫ లం చెందాయన్నారు. రోజురోజుకి గంజాయి, మత్తు పదార్థాల మాఫియాలో యువత చిక్కుకొని జీవితాలు చిన్నాభిన్నం చేసుకుంటున్నాయన్నారు. నెల్లూరు జిల్లాలో గంజాయి ముఠాకి వ్యతిరేకంగా పోరాడుతున్న సీపీఐ నాయకులు పెంచలయ్యను హత్య గావించడం జరిగిందన్నారు. పెంచలయ్య కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం ప్రకటించాలన్నారు. ఆయన సతీమణికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, అదే విధంగా కుటుంబ పోషణకు ఐదు ఎకరాలు భూమిని ఇవ్వాలని తెలిపారు. భగత్ సింగ్ స్పూర్తితో విద్యార్థులు, యువత కలిసి గంజాయిని నిర్మూలిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.పి.నరసింహ, ఐద్వా జిల్లా అధ్యక్షులు టి.శివ కుమారి, ఐద్వా రూరల్ కార్యదర్శి షాహీన, ఐద్వా నగర కార్యదర్శి కె.పద్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి.నరేంద్ర, గూడూరు సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జోగి శివ కుమార్, బి.వి రమణయ్య, పామంజి మణి , పుట్టా శంకరయ్య, అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, వెంకటరామి రెడ్డి, గండికోట మధు, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా మద్దూరి నియామకం

వింజమూరు, మార్చి 23, ప్రభాతవార్త : నెల్లూరు జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడిగా వింజమూరుకు చెందిన మద్దూరి నాగేశ్వరరెడ్డి నియమితులయ్యారు. జిల్లా కార్యాలయంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరకాల మోహన్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు పథకాలపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పిస్తామని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా తన వంతు కృషి చేస్తానని, గతంలో తాను వింజమూరు పట్టణ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా చేసిన అనుభవంతో జిల్లాలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పని చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా బీజేపీ అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, తిరకాల మోహన్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వింజమూరు మండల బీజేపీ అధ్యక్షుడు అంబటి ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నాగేశ్వరరెడ్డి నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆయన ఆధ్వర్యంలో మండలంలో పార్టీ మరింత పటిష్టమవుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, వరికుంటపాడు అధ్యక్షుడు ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మన్నేటి శ్రీనివాసులురెడ్డి, బీజేవైఎం జోనల్ ఇన్‌చార్జి లెక్కల రాజశేఖర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు మల్లం కొండారెడ్డి, ఎం.రామచంద్ర, నూతక్కి భాస్కర్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ నియామకం పట్ల పలు మండలాల నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తూ నాగేశ్వరరెడ్డికి అభినందనలు తెలియజేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలి

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 23, ప్రభాతవార్త : నగరంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, పక్కా ఇల్లు నిర్మించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్లో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లకు పార్టీ నాయకులతో కలిసి సిపిఎం పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో మంత్రి నారా యణ అనాలోచిత నిర్ణయంతో వేలాది రూపాయలు వెచ్చించి వేసవికాలంలో చెట్లు నాటించడం ఏ పాటిధన్నారు. నగరంలో దోమల బెడద ఎక్కువగా ఉన్న పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు నాగేశ్వర్ రావు, సూర్య నారాయణ, అల్లంపాటి శ్రీనివాసుల రెడ్డి, చిరంజీవి, శ్రీధర్, సెనయ్య, ఫయాజ్, ఉడత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు మరింత వేగవంతం కావాలి

కోవూరు, మార్చి 23 ప్రభాతవార్త : కోవూరు మండలంలోని అన్ని పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్ల విషయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరు మండలం పడుగు పాడు పంచాయతీలో జరుగుతున్న ఇంటి పన్నుల వసూలు కార్యక్రమాన్ని సోమవారం ఆయన ఆకస్మి కంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పంచాయతీలు మరింత అభివృద్ధి పథంలో పయనించాలంటే ఇంటి పన్నుల వసూళ్లకు ప్రజలు కూడా సహకరించి సకాలంలో చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సలీమ్, తదితరులు ఉన్నారు.

బోడబండ ఎస్సీ కాలనీలో మృతి చెందిన ప్రత్యూష

- కుటుంబంను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉదయగిరి, మార్చి 23, ప్రభాతవార్త మండల పరిధిలోని బోడబండ ఎస్సీ కాలనీలో వ్యక్తిగత కారణాల వలన మరణించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుడు ప్రసాద్ కుమార్తె ప్రత్యూష మృతదేహానికి ఉదయగిరి మండల కన్వీనర్ కొండా రాజగోపాల్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరామర్శించి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించిన ఉదయగిరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించి ఎల్లవేళలా ఆ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ అజీజ్ కుటుంబాన్ని పరామర్శించిన నల్లపరెడ్డి

కోవూరు, మార్చి 23 ప్రభాతవార్త : రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాతృమూర్తి అన్వర్ జాన్ ఇటీవల మృతిచెందడం విధితమే. ఈ మేరకు సోమవారం మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అజీజ్ ఇంటికి వెళ్లి ఆయనను వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు వీరి చలపతిరావు, షాహుల్, కాటంరెడ్డి నవీన్, తదితరులు ఉన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలుగా తీర్చిదిద్దిన మంత్రి లోకేష్ : ఎమ్మెల్యే

గూడూరు, మార్చి 23, ప్రభాతవార్త ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మంత్రి నారా లోకేష్ విద్యార్థిని విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారని, మధ్యాహ్నం కూడా ఎంతో రుచికరంగా ఉందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు గాంధీ నగర్ లోని ఎంపీపీ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే సునీల్ కుమార్ తనిఖీ చేశారు. పిల్లలతో కలిసి భోజనాన్ని స్వీకరించారు. అనంతరం క్లాస్ రూమ్‌లో పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ విద్యాశఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలలో అనేక మౌలిక వసతులు కల్పిస్తున్నారని మధ్యాహ్నం భోజనం కూడా ఎంతో నాణ్యతగా ఉందని తెలిపారు. పేద బిడ్డలు కూడా చదువుకోవాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిల్లలను పాఠశాలలకు పంపించిన తల్లులకు సంవత్సరానికి 15000 రూపాయలు నగదు జమ చేస్తున్నారని యూనిఫారాలు, పుస్తకాలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉచితంగా అందిస్తున్నారని గుర్తు చేశారు. పిల్లలు ఆడుకునే వస్తువులు కావాలని తెలిపారని వెంటనే వాటిని ఏర్పాటుచేస్తామని అన్నారు. ఎంఈఓ, నాయకులు పాల్గొన్నారు.

జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట మహాకుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం

కోట, మార్చి 23 ప్రభాతవార్త కోట మండలం విద్యానగర్‌లోని శ్రీ విద్యాగణపతి ఆలయంలో సోమవారం జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట మహా కుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వరపూజ, శైవ శుద్ధి, మహాపుణ్యా వచనం, పంచగవ్య ప్రాసన, రక్షావిధి, దీక్షా స్వీ కరణ, అఖండ స్థాపనతో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. స్వామివారిని వివిధ పుష్పాలం కరణ లు, బాణాసంచా వేడుకలతో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

'వార్త' కథనంతో కదలిన యంత్రాగం నిందితుడి ఆచూకి లభ్యం

కోట, మార్చి 23 ప్రభాతవార్త కోట మండలం చిట్టేడు గ్రామానికి చెందిన ఓ మైనార్ గిరిజన బాలిక ఈ నెల 19న ఇంటి నుంచి అదృశ్యమైన విషయం తెలిసింది.నాలుగు రోజులగా ఆబాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ వద్ద నాయ్యం కొరకు తమ బిడ్డ ఆచూకీ కొరకు దీనంగా ఉండటం కనిపించింది. దీంతో కళ్లె ఎదుటే నేరం.. కదలని యంత్రాగం అనే వార్తను వార్తలో ప్రచురిండంతో జిల్లా ఎస్పీ అజితవేజండ్ల ఈ కేసు పురోగతిపై ఆరా తీసినట్లు సమాచారం. ఆమేరకు పోలీసులు వేగంగా ముందుకు కదలారు. దీంతో ఇద్దరు పోలీసులను గుంటూరు జిల్లా గురజాల ప్రాంతానికి పంపినట్లు ఎస్ఐ పవన్ కుమార్ వెల్లం డించారు.ఆమేరకు నిందితుడుతోపాటు ఆమైనార్ బాలికను కూడా తీసుకొస్తుట్లు చెప్పారు. గురుజాల ప్రాంతంకు చెందిన ఓయువకుడు పెట్రోల్ బంకులో పనిచేసే యువకుడుగా గురించినట్లు తెలిసింది.

ప్రతి రైతునూ ఆదుకుంటాం : మంత్రి అనం

నెల్లూరు కలెక్టరేట్, మార్చి 23, ప్రభాతవార్త నష్టపోయిన ప్రతి ఒక్క రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుం దని, ప్రతి పం టకు నష్టపరిహారం చెల్లిస్తామని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలి పారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, ఇతర అధికారులతో కలసి ఇటీవలి పంట నష్టాలపై సమీక్ష నిర్వహించారు. అంతకుముందు అనంతసాగరం మండలంలోని చిలకలమర్రి, కా మిరెడ్డిపాడు, మంగుపల్లి గ్రామాల్లో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న వరి, పత్తి, మిరప తదితర పంట పొలాలను మంత్రి స్వయంగా పరిశీలించి వచ్చారు.అనంతరం మంత్రి ఆనం మీడియాతో మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం కారణంగా అనంతసాగరం, మర్రిపాడు, కలువాయి, రాపూరు, సీతారాంపురం, మండలాల్లోని 21 గ్రామాల్లో 1469 మంది రైతులు సుమారు 1289 హెక్టార్లలో పంటలను నష్టపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో తక్షణమే కచ్చితమైన ఎన్యుమరేషన్ పూర్తి చేసి నివే దికను కలెక్టర్‌కు అందించాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపించి, నిబంధనల మేరకు సకాలంలో నష్టపరిహారం అందిస్తామని పేర్కొన్నారు. కౌలు రైతులను కూడా ఆదుకుం టామని స్పష్టం చేశారు. అదేవిధంగా అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లుగాను, గోతాలు, రవాణా తదితర సమస్యలను అధిగమించి రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఎవరు అధైర్యపడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి ఇతర అధి కారులు పాల్గొన్నారు.

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ సాధనే ధ్యేయం

నెల్లూరు మార్చి 23, ప్రభాతవార్త వైఎ స్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డితో స మావేశమై రాయలసీమ ఎత్తిపోతల పథకం గురించి చర్చించిన పలు జిల్లాల పార్టీ అ ధ్యక్షులు, కాకాణి గోవర్ధన్ రెడ్డి అనంత వెంకట్రామిరెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, భూమన కరుణాక ర్‌రెడ్డి , అమర్నాథ్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి , ఉష శ్రీచరణతోపాటు శైలజానాథ్, సతీష్ కుమార్‌రెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షులు మనోహర్ రెడ్డి , పుట్టా శివ శంకర్, పలువురు రైతు సంఘాల నాయకులు, తదితరులు రాయలసీమ ఎత్తిపోతల పథకం సాధనేధ్యేయంగా పనిచేయాలి రాయ లసీమ ఎత్తిపోతల పథకం దాదాపు పూర్తికావస్తున్న నేపథ్యంలో చంద్రబాబు మోకాలు అడ్డడం అన్యాయం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు విని చంద్రబాబు ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు, రైతాంగానికి తీరని ద్రోహం తలపెట్టాడు కర్ణాటక రాష్ట్రం ఒక పక్క ఆల్మట్టి ఎత్తు పెంచుతూ నిర్ణయం తీసుకుని ముందుకు వెళుతున్న నేపథ్యంలో ఆంధ్రా ప్రాంతానికి తీవ్రమైన సాగునీటి కొరత రాబోతుంది తెలంగాణ రాష్ట్రం శ్రీశైలం జలాశయం నుండి 800 అడుగుల దిగువ భాగం నుండే రోజుకు 8 టీఎంసీల నీరు తరలించుకుపోతుంది చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే శ్రీశైలం జలాశయాన్ని నిబంధనలు అతిక్రమించి వినియోగించుకునే విధంగా గతంలో తెలంగాణ ప్రభుత్వం అనేక ప్రాజెక్టులు నిర్మించింది చంద్రబాబు తిరిగి 2024 లో ముఖ్య మంత్రి కాగానే రేవంత్ రెడ్డి మాటలు విని రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని అటకెక్కించేశాడు రాయలసీమ ఎత్తిపోతల పథకం యొక్క ప్రాధాన్యతను రైతులకు, ప్రజలకు వివరించి, ప్రభుత్వంపై పోరాటం చేద్దాం జిల్లాస్థాయి, నియోజకవర్గస్థాయి సమావేశాలు ఏర్పాటు చేసుకుని, రైతాంగానికి సాగునీటి కోసం, ప్రజా నీకానికి త్రాగు నీటి కోసం, ఉత్పన్నం కానున్న కష్ట,నష్టాల గురించి వివరిద్దాం రాయలసీమ లిఫ్ట్ సాధన కోసం అన్ని వర్గాల ప్రజలు, కలిసి వచ్చే అన్ని పార్టీలు, స్వచ్ఛంద సేవ సంస్థలు, పౌరహక్కుల నేతలు, రైతు సంఘం నాయకులు, అందరితో కలిసి ఉద్యమిద్దాం రాయలసీమ ఎత్తిపోతల సాధనే ధ్యేయంగా వినూత్న కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి, తిరిగి ప్రారంభించే వరకు పోరాడుదాం చంద్రబాబు మెడలు వంచైనా, రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని సాధించి ,రాయలసీమ ప్రాంతంతోపాటు, నెల్లూరు, దక్షిణ ప్రకాశం ప్రాంతాలకు సాగునీరు, త్రాగు నీరు, అందించేందుకు సన్నద్ధం కావాలి జగన్మోహన్ రెడ్డి రోజుకు రెండు టీఎంసీల చొప్పున రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు లిఫ్ట్ ద్వారా నీరందించాలనే లక్ష్యంతో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శ్రీకారం చుట్టారు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రా రంభించి, దాదాపు పూర్తవుతున్న పరిస్థితుల్లో జగన్మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందని, రైతుల ప్రయోజనాలు విస్మరించి, చంద్రబాబు, రేవంత్ రెడ్డి మాటలు విని అర్ధాంతరంగా ఆపివేయడం దుర్మార్గం రై తులు, ప్రజలు కూటమి ప్రభుత్వం చేస్తున్న అనైతిక పాలనను గుర్తించి, ఎదిరించేందుకు సిద్ధపడాలి భవిష్యత్ కార్యాచరణలో యువకులు, విద్యార్థులను కూడా భాగస్వాములను చేసి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ద్వారా గ్రామ, గ్రామాన రాయలసీమ ఎత్తిపోతల పథకం యొక్క ప్రాధాన్యతను వివరించి, రైతులు, ప్రజల మద్దతుతో, పెద్ద ఎత్తున ఉద్యమిద్దాం

శ్రీ విజయ దుర్గ ఉప పీఠం ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం

గూడూరు, మార్చి 23, ప్రభాతవార్త రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థు లకు హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ఆధ్వర్యంలో అక్షరా భ్యాస కార్యక్రమం నిర్వ హించడం సంతోషంగా ఉందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశంసునీల్ కుమార్ పేర్కొన్నారు. హిందూ ధర్మపరిరక్షణ ట్రస్ట్ చైర్మన్ దాసరి శ్రీనివాసులు గౌడ్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా గత ఐదు రోజుల నుండి అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా చివరి రోజు గూడూరు పట్టణంలోని శ్రీ విజయ దుర్గ ఉప పీఠం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ హాజరయ్యారు. పీఠం నిర్వాహకులు కోటా సునీల్ కుమార్ ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే విజయ దుర్గ అమ్మ వారిని దర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులచే అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు స్కూల్ బ్యాగ్స్, పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందని దానిలో తాను పాల్గొని పిల్లలతో అక్షరాభ్యాసం చేయించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని తెలిపారు. లోక శాంతి కొరకు కోట సునీల్ కుమార్ అనేక దైవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిపివో మెహబూబీ, టీడీపీ నాయకులు అబ్దుల్ రహీం, పాల్గొన్నారు.

జాతీయ చేనేత ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

కోవూరు, మార్చి 23 ప్రభాతవార్త : నెల్లూరు నగరంలోని పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కమిషనర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత ఎగ్జిబిషన్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రారంభించారు. చేనేత వృత్తిపై ఆధారపడిన కార్మికులను ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో మన రాష్ట్రంలోని మంగళగిరి, ఉప్పాడ, బాపట్ల, చీరాల, శ్రీకాళహస్తి, వెంకటగిరి ప్రాంతాల నుంచే కాకుండా తెలంగాణ రాష్టానికి చెందిన గద్వాల, నారాయణపురంతో పాటు జమ్మూ కాశ్మీర్, ఉత్తరప్రదేశ్,బీహార్ రాష్ట్రాల నుండి వచ్చిన విభిన్న చేనేత ఉత్పత్తులు ఈ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ చేనేత కార్మికుల కష్టానికి నైపుణ్యానికి ప్రతి రూపమైన ఈ వస్త్రాలు అత్యంత నాణ్యతతో ఉన్నాయని కొనియాడారు. ప్రజలందరూ ఈ ప్రదర్శనను సందర్శించి తమకు నచ్చిన చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి నేతన్నలకు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. మార్చి 23 నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు అందుబాటులో ఉండే ఈ ఎగ్జిబిషన్‌లో దేశ నలుమూలల నుండి వచ్చిన చేనేత ఉత్పత్తులను ఆదరించాలని కోరారు. ఈ చేనేత ఎగ్జిబిషన్ జిల్లా హ్యాండ్ లూమ్ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

ఈపూరు మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపినుండి టిడిపిలో చేరికలు

వెంకటాచలం మార్చి 23 ప్రభాతవార్త : మండల పరిధిలోని గుదూరు వారి పాలెం గ్రామానికి చెందిన ఈపూరు మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు యువత, వైసీపి వీడి 37, కుటుంబాలు టిడిపి పార్టీ కండువా కప్పుకున్నారు. సోమవారం నెల్లూరులోనే వేదయపాలెంలో సోమిరెడ్డి కార్యాలయంలో మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమక్షంలో, పార్టీ లో చేరారు. కూటమి పాలన జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్ర మాలు చూసి వైసిపి వీడి టిడిపి పార్టీలోచేరేందుకు ఉత్సాహం ఉత్సాహం చూపుతున్నారన్నారు.గత ప్ర భుత్వంలో పనులు చేయకుం డా నే.బిల్లులు చేసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. రెండేళ్ల ప్రభుత్వ హయాంలో 100 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని అందరూ కలిసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి అన్నారు. గుడ్లూరు వారి పాలెం గ్రామాన్ని మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. మహిళలు గ్రామస్తులు, గజమాలతో సోమిరెడ్డిని మురళీధర్ రెడ్డిని సత్కరించారు.

ఘర్షణలో గాయపడిన పవన్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

కావలి, మార్చి 23 ప్రభాతవార్త : స్థానిక తుమ్మలపెంట రోడ్డులోని దాబా హోటల్ వద్ద జరిగిన ఘర్షణలో గాయపడి ఆసుపత్రిలో చికిత్సలు పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇడి ముక్కల పవన్‌ను ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదివారం రాత్రి వారి నివాసానికి వెళ్ళిన పరామర్శించారు. అనంతరం ఆయన ఆరోగ్య పరిస్తితిని అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, రూరల్ మండల అధ్యక్షులు ఆవుల రామక్రిష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా లారీల అన్‌లోడింగ్ - ట్రాఫిక్ జామ్‌లో కోవూరు

కోవూరు, మార్చి 23 ప్రభాతవార్త : కోవూరు బజార్ సెంటర్ నుంచి మందబయలు సెంటర్ వరకు ఉన్న పలు వ్యాపారస్తులు తమ వ్యాపారానికి సంబంధించిన వస్తువులను వేళాపాల లేకుండా తమ ఇష్టానుసారంగా ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో అన్‌లోడింగ్ చేసుకోవడం వలన ట్రాఫిక్‌కు పూర్తిగా అంతరాయం ఏర్పడుతుంది. ఫలితంగా ద్విచక్ర వాహన చోదుకులు తీవ్రస్థాయిలో ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. వాస్తవంగా మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల ప్రాంతంలోనే ఈ వ్యాపారస్తులు వస్తువులు అన్‌లోడింగ్ చేసుకోవాలని ఉన్నా వీరు మాత్రం ఉదయం, రాత్రి వేళల్లో తమ ఇష్టానుసారంగా అన్‌లోడింగ్ చేసుకుంటూ ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్ శాఖ స్పందించి ట్రాఫిక్ జామ్‌ను క్రమబద్దీకరించాలని ద్విచక్రవాహనదారులు కోరుకుంటున్నారు.

పోలీసుల చొరవతో బుచ్చిలో ట్రాఫిక్ సమస్యకు చెక్

ఆర్టీసి బస్టాండ్‌లోనే బస్సులు ఎక్కడం, దిగడం

బుచ్చి మార్చి 23 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం బస్టాండ్‌లో వైఎస్ఆర్ బొమ్మ వద్ద నిత్యం ట్రాఫిక్ పద్మ వ్యూహం కనిపిస్తుండేది. ఆర్టీసి బస్సులు ప్రయాణికులకోసం రోడ్డులోనిలిపి వేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తు తుండేది. అనేక సార్లు అంబులెన్స్‌లు కూడా ఆగిపోయిన సంఘటనలుఉన్నాయి.కొన్ని నెలల క్రితం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి కూడా ట్రాపిక్ సమస్యను తీసుకొని వెళ్లారు. ఆమె దీనిపైన ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇప్పటికి ఈ సమస్య కొలికి వచ్చింది.ప్రస్తుతం కొ త్తగా వచ్చిన సిఐ శ్రీనివాసరావు ఆర్టీసి డిపో మేనేజర్లతో మాట్లాడి బస్టాండ్‌లో బస్సులు నిలిపకుండా చేసి ఆర్టీసి డిపోకి పంపించడంతో బస్టాండ్‌లో పూర్తిగా ట్రాపిక్ సమస్య లేకుండా పోయింది. కొత్తగా ఆర్టీసి బస్టాండ్‌కు వెళ్లడం ప్రజలకు కొంత ఇబ్బంది కరం అయినా అలవాటు అవుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పాత బస్టాండ్‌లో అయితే ప్రయాణికులు కూర్చునేందుకు వీలు లేదు, ఎండలో నిలబ డాలి,వానలో తడవాల్సి వచ్చేది. కనీసం బాత్‌రూంకి వెళ్ళాలన్న అక్కడ ఎటువంటి వసతులు ఉండేదవి కాదు. ప్రస్తుతం ఆర్టీసి బస్టాండ్‌లో కూర్చోను కుర్చీలు ఉన్నాయి. బాత్ రూంలో ఉన్నాయి. త్రాగేందుకు మంచినీళ్లు ఉన్నాయి. ఈవిధానం 90 శాతం బాగుందని అంటున్నారు. పదిశాతం మంది మాత్రం కొంత అసంతృప్తి వ్యక్తచేస్తున్నారు. ఈవిధానం కొనసాగిస్తే బుచ్చిలో చెన్నూరు రోడ్డులో కూడా ట్రాపిక్ సమస్య చాలా వరకు తగ్గుతుంది. పోలీసులు బస్టాండ్‌లో ఆటోల పైన కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు. అలాగే ఆర్టీసి బస్టాండ్‌లో మరో రెండు మూడు లైట్లు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా అధ్యక్షులు బీదను కలిసిన చల్లా

వింజమూరు, మార్చి 23, ప్రభాతవార్త జి ల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నియమితులైన ఎమ్మెల్సీ బీద రవిచంద్రను వింజమూరు సొసైటీ చైర్మన్ చల్లా వెంక టేశ్వర్లు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షులుగా జిల్లా పార్టీ కా ర్యాలయంలో బీదరవిచంద్ర ప్రమాణ స్వీ కారం చేసిన సందర్భాన్ని పురస్కరించు కుని చల్లా బృందం నెల్లూరు వెళ్లి బీదకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా పూలమా లతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చల్లా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో తెలుగుదేశం పార్టీ బలీయంగా మార్చేందుకు నూతన అధ్యక్షుడు బీద రవిచంద్ర అందరి సహకారంతో ముందుకు సాగుతారని ఆకాంక్షించారు. పార్టీ అభివృద్ధికి సమిష్టి కృషి చేయాల్సి న అవసరం ఉందని అందరి సమన్వయం సహకారంతో ముందుకు సాగి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయకేతనం ఎగురవేసేందుకు మావంతు సహకారాన్ని శాయశక్తుల అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు కేవస్ నాయుడు కొండపల్లి వెంకటేశ్వర్లు నాయుడు, దొరస్వామి నాయుడు, ఇతర దేశం నేతలు తదితరులు ఉన్నారు.

అంతర్గత విబేధాలకు స్వస్తి పలకుదాం - పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేద్దాం : మేకపాటి

వింజమూరు, మార్చి 23, ప్రభాతవార్త ఉదయగిరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విబేధాలకు నేతలు స్వస్తి పలికి పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మేకపాటి రాజగోపా ల్‌రెడ్డి పిలుపునిచ్చారు. వింజమూరులోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మండల నాయకులతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ రేవునూరి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఉదయగిరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కూనం సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో ముందుగా ప్రతి గ్రామ పంచాయతీ నుండి విచ్చేసిన నేతలతో పార్టీ పరిస్థితులపై మాట్లాడించారు అనంతరం మండల నేతలు సుదీర్ఘంగా మాట్లాడారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్త రాబోవు ఎన్నికలకు సిద్ధం కావాలని ఈ సారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకునే విధంగా ప్రతి ఒక్కరం పనిచేద్దామని అన్నారు. నియోజకవర్గంలో కొన్ని చోట్ల పార్టీలో నేతల మధ్య చిన్న చిన్న గల్లికజ్జాలు ఉన్నాయని వాటిని పక్కన పెట్టి పార్టీయే ముందుగా పని చేయాల్సి న ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గం ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఎంతో నమ్మకంతో ఉఆన్నరని అలాంటి వారికి ఎలాంటి కష్టం వచ్చిన నాయకులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా నిలవాలని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో జరిగిన చిన్న పాటి పొరపాట్లను పునరావృతం కాకుండా జాగ్రత్త పడాల్సి న బాధ్యత కార్యకర్తలు, నాయకులపై ఉందన్నారు. ఆ బాధ్యతను తాను కూడా తీసుకుంటానని భరోసా ఇచ్చారు. గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు పార్టీ కోసం నిరంతరం నిర్మిస్తున్న కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతం చేసే క్రమంలో త్వరలో బలోపేత కమిటీలను మేకపాటి ప్రకటించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు జడ్పీటీసీ సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పల్లాల కొండారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు తిప్పిరెడ్డి నారపరెడ్డి మద్దూర్ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, మద్దూరి చిన్ని కృష్ణారెడ్డి, గణపం రమేష్‌రెడ్డి, బయ్యపురెడ్డి విజయ్ కృష్ణారెడ్డి, మలిరెడ్డి విజయ్ కుమార్‌రెడ్డి, కొండపల్లి రమేష్‌రెడ్డి, కొండయ్య, పల్లాల ప్రసాద్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పబ్లిసిటింగ్ వింగ్ అధ్యక్షులు అంకినపల్లి నరసింహారెడ్డి, భోగిరెడ్డి రవీంద్రారెడ్డి, కాటం రవీంద్రారెడ్డి, చీమల హజరత్‌రెడ్డి, సూరం వినోద్‌రెడ్డి, అబ్దుల్ సలాం, చీమల బలరాంరెడ్డి, దేగ వంశీ, జిలాని వెంకీ, బ్రహ్మారెడ్డి, సాంబ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు మేకపాటి విరాళం

వింజమూరు, మార్చి 23, ప్రభాతవార్త పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సోమవారం సాయంత్రం హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు కాలనీ వాసులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. మేళ తాళాలతో ప్రధాన రహదారి నుండి ఆలయం వద్దకు బాణసంచ మోతలతో మేకపాటిని ఆహ్వానించారు. మేకపాటి ఆలయానికి వెళ్లి స్వామివారికి పూజలు నిర్వహించి ఆశీర్వాదములు అందుకున్నారు. స్వామివారి ప్రతిష్ఠాపన కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసి ఈ గ్రామ వాసులకు స్వామివారి ఆశీస్సులు నిండుగా ఉండేలా ఆయన కృపా కటాక్షములు ఉండి మీరంతా చల్లగా ఉండాలని కోరుకున్నారు. అనంతరం లక్ష రూ పాయలు మేకపాటి విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నియోజకవర్గ వైఎస్సార్ కాం గ్రెస్ పార్టీ పరిశీలకులు కూనం సుధాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ రేవునూరి శ్రీనివాసులురెడ్డి, జడ్పీటీసీ సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు పల్లాల కొండారెడ్డి, మద్దూర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి, పలాల ప్రసాద్‌రెడ్డి, భోజనపు గోపి, నాయి బ్రాహ్మణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.